## టమాట కిలో రూ.35


పీలేరు మార్కెట్ కమిటీ వద్ద టామాట విక్రయిస్తున్న సిబ్బంది

పీలేరులో టమాట కిలో రూ.35... అదేంటి జిల్లాలో ఎక్కడ చూసినా కిలో రూ.70 నుంచి రూ.90 వరకు అమ్ముతున్నారే అనుకుంటున్నారా! మీరు విన్నది నిజమే. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద రాయితీ టమాట విక్రయశాలను ఏర్పాటు చేశారు. రాయచోటిలో కిలో రూ.35, మదనపల్లెలో కిలో రూ.30 వంతున విక్రయించినట్లు జిల్లా మార్కెట్ కమిటీ అధికారి త్యాగరాజు తెలిపారు. డిమాండ్‌ను బట్టీ శుక్రవారం కూడా టమాటాలు విక్రయిస్తామని ఆయన వెల్లడించారు. - న్యూస్‌టుడే, పీలేరు

## చామంతి... దసరాతో ధరల కాంతి



దసరా పండగ వేళ చామంతి పూలకు గిరాకీ ఏర్పడింది. ఇది వరకు కిలో చామంతి రూ.70 నుంచి రూ.100లోపే పలికేది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో చామంతి రూ.300కు పైగా పలుకుతోంది. దీంతో డిమాండు ఆధారంగా వ్యాపారులు తోటల వద్దకే పరుగులు తీస్తున్నారు. రామసముద్రం మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు 200 ఎకరాలకు పైగానే చామంతిని సాగు చేశారు. రోజూ ఈ ప్రాంతం నుంచి 100 టన్నులకు పైగానే పూలు హైదరాబాదు, రాజమహేంద్రవరం, విజయవాడ, బెంగళూరు, చెన్నై వంటి మార్కెట్లకు ఎగుమతి చేస్తున్నారు. చిన్న వ్యాపారులూ చామంతి పూలను దారంతో కట్టి ఎగుమతి చేస్తూ లాభాలను పొందుతున్నారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

## దుర్గతి నాశిని... మహిషాసురమర్దని

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం జగన్మాత దుర్గతులను నాశనం చేసి సద్గతులను ప్రసాదించే మంగళకారిణిగా దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో సింహ వాహనియై తేజోమయ రూపంలో జగజ్జనని భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మను పూజిస్తే దుర్గతులు, దుర్గణాలు నాశనమై సద్గుణ రాశులను ప్రసాదిస్తుందని భక్తుల నమ్మిక. పలు ఆలయాల్లో మంగళ గౌరిగా అమ్మవారిని అలంకరించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదివ్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం



రాయచోటి వీరభద్రాలయంలో భద్రకాళి అమ్మవారు


రైల్వేకోడూరులో మహిషాసురమర్దనిగా కన్యకాపరమేశ్వరి


పీలేరు : దుర్గా అలంకారంలో కన్యకాపరమేశ్వరి


దుర్గాదేవి అలంకరణలో కలికిరి ఎల్లమ్మ


వెంకటరాజంపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో మహిషాసురమర్దని అలంకరణ


నీరుగట్టువారిపల్లెలో మహిషాసుర మర్దని అలంకారంలో చౌడేశ్వరి

## రూ.71 కోట్లు... 723 పనులు : కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

**రాయచోటి, న్యూస్‌టుడే:** జిల్లాలో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఆమోదం పొందిన ప్రతి పనికి భూమి పూజ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. చేపట్టిన పనుల వివరాలపై ముందుగా గ్రామాల్లో టాంటాం వేయించాలన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.71 కోట్లు విలువైన 723 పనులు చేపట్టనున్నామన్నారు. వీటికి అదనంగా పంచాయతీలోని సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయని చెప్పారు. ముందుగా ప్రజాప్రతినిధుల నుంచి షెడ్యూలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల చిత్రాలను పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, గుర్తించిన పనులన్నింటినీ జియోట్యాగ్ చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, ఎంపీడీవోలు, ఉపాధి హామీ, పంచాయతీరాజ్ సిబ్బంది, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

## 490 మంది పోలీసులు... 149 వాహనాలు


రెండో పట్టణ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

490 మంది పోలీసులు... ఒకేసారి నాలుగు కాలనీలను చుట్టుముట్టారు... ప్రతి ఇంటా తనిఖీలు చేపట్టారు... ఫలితం ఎలాంటి దస్త్రాలు లేని 149 వాహనాలు పట్టుబడ్డాయి.. పట్టణంలోని ఓ ప్రాంతంలోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లావ్యాప్తంగా ఇలాంటి వాహనాలు ఇంకా ఎన్ని ఉన్నాయో... గురువారం మదనపల్లె పట్టణంలోని రామారావు కాలనీ, చీకలగుట్ట, వీవర్స్ కాలనీ, గొల్లపల్లె, విజయనగర్ కాలనీలను తెల్లవారుజామున ఒకేసారి పోలీసులు చుట్టుముట్టి తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ కొండయ్య నాయుడు ఆధ్వర్యంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, 11 మంది సీఐలు, 31 మంది ఎస్ఐలతో పాటు సిబ్బంది నాకాబందీలో పాల్గొన్నారు. తనిఖీల్లో ఎలాంటి రికార్డులు లేని 140 ద్విచక్ర వాహనాలు, 9 ఆటోలను జప్తు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

# చెరువులు నిండేలా...
# కరవు నేలకు జలకళ

### ప్రాధాన్య పనులకే సర్కారు పెద్దపీట
### తక్కువ వ్యయం... ఎక్కువ ఆయకట్టు సాగే లక్ష్యం

వైకాపా ప్రభుత్వం చేసిన పాపాలు ఎన్డీఏ ప్రభుత్వానికి గుదిబండగా మారుతున్నాయి. గత సర్కారు సాగునీటి ప్రాజెక్టులను విస్మరించడమే కాకుండా కనీసం కాలువల విస్తరణనూ పట్టించుకోలేదు. ఫలితంగా ఆయకట్టు సాగుకు నోచుకోకుండా బీడుగా మారిపోయింది. ఈ పరిస్థితిలో ఎన్డీఏ సర్కారు ఓ నిర్ణయానికి వచ్చింది. ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని 25 శాతంలోపు ఉన్న పనుల్ని రద్దు చేయాలని... ప్రాధాన్యం ఉన్న పనుల్ని గుర్తించి పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకుంది. ఈ మేరకు వైకాపా ప్రభుత్వం చేపట్టి.. అసంపూర్తిగా నిలివేసిన రూ.14,400 కోట్ల పనుల్ని రద్దు చేసి ప్రాధాన్యతా క్రమంలో రూ.876 కోట్ల పనుల్ని ఎంపిక చేసింది. రద్దు చేయనున్న పనుల్లో 25 లోపు ఉన్నవి ఐదు ఉండగా.. పనులే చేపట్టనివి 11 వరకు ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. - ఈనాడు, కడప

### కుందూపై ఎత్తిపోతల పథకం




కుందూనదిపై ఎత్తిపోతల పథకాన్ని ప్రాధాన్యత కింద ప్రతిపాదించారు. కుందూనది నుంచి 9 టీఎంసీల నీటిని తెలుగుగంగ ప్రధాన కాల్వలోకి ఎత్తిపోసి బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను నింపనున్నారు. ఈ విధానం కింద 1.58 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని చెరువులన్నింటినీ అనుసంధానం చేసి నీటిని నింపనున్నారు. ఇందుకోసం రూ.564 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. భూసేకరణ 75 శాతం వరకు పూర్తి చేశారు.

● హంద్రీ-నీవా కాలువ విస్తరణ, ఆధునికీరణ పనులు తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేపట్టారు. ఈ పనుల్ని వేగవంతం చేయడానికి ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్ర పరిశీలన చేపట్టి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు.




గండికోట జలాశయం

● తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే దిశగా ఎత్తిపోతల పథకాన్ని మైదుకూరు నియోజకవర్గానికి ఉపయుక్తంగా చేపడుతున్నారు.



● గాలేరు-నగరి సుజల స్రవంతి 1,2 దశల్లో భాగంగా వామికొండ, సర్వరాయ సాగర్ జలాశయాల నుంచి ప్రధాన, ఉప కాలువలను పూర్తి చేయడానికి రూ.212.89 కోట్లు అవసరమని గుర్తించి ప్రతిపాదించారు. ఈ పనుల్ని పూర్తి చేయడం ద్వారా 35 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. ఇప్పటికే జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ 34 కి.మీ మేర పూర్తి అయింది. అసంపూర్తి పనులు పూర్తి చేయడం ద్వారా కమలాపురం నియోజకవర్గానికి ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు కాలువ కడప సమీపం వరకు పూర్తి చేసే పక్షంలో గ్రావిటీ ద్వారా కడప నగరంలో 3.50 లక్షల మందికి తాగునీరు అందించవచ్చనే అంచనాకు వచ్చారు. గండికోట ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేపట్టారు.



● చిత్రావతి ప్రాజెక్టు 10 టీఎంసీల నీటి సామర్థ్యం ఉంది. కాలువ గోడల నిర్మాణం, ప్రాజెక్టు నిర్వహణకు రూ.13.46 కోట్లు అవసరమని గుర్తించారు. పైడిపాళ్యం రిజర్వాయర్ నిర్వహణ పనులను రూ.34.40 కోట్లతో చేపట్టాలని ప్రతిపాదించారు.



● పీబీసీ ప్రాజెక్టు ప్రధాన కాలువల వంతెన మరమ్మతులకు రూ.96 లక్షలతో పనులు చేపట్టనున్నారు. 65 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్న వంతెన లీకేజీని అరికట్టడానికి చర్యలు చేపడుతున్నారు.
● పులివెందుల బ్రాంచి కెనాల్ ఆక్విడెక్టు ఆధునికీకరణకు రూ.5.63 కోట్లుతో పనులు చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



### ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు

ఉమ్మడి కడప జిల్లాలోని ప్రాజెక్టుల్లో 75 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోగా.. గండికోట, పైడిపాళ్యం, చిత్రావతి, మైలవరం, వామికొండ, సర్వరాయ సాగర్, వెలిగల్లు, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులున్నాయి. వీటి నిర్వహణ, పంట కాలువల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు.

### సమాచారం సేకరిస్తున్నాం

ఇప్పటికే చేపట్టిన సాగునీటి పనులు 25 శాతం లోపే జరిగిన వాటి వివరాలను పంపించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందాయి. ఈ వారంలో ఉన్నతాధికారులకు నివేదిస్తాం. తదుపరి వచ్చే ఉత్తర్వులను అనుసరించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి పూర్తి చేయిస్తాం. ఆయకట్టుకు నీరిస్తాం. - ఎం.మల్లికార్జునరెడ్డి, సీఈ, నీటిపారుదలశాఖ

## జడ్పీలో వైకాపా మార్కు హల్‌చల్

### అధికారం లేకున్నా బెదిరింపులు
### నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశం

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే:** 'ఏం సీఈవో గారూ! ఛైర్‌పర్సన్‌కు తెలియకుండా, ఆమె అనుమతి తీసుకోకుండా జడ్పీ అభివృద్ధి పనులు ఎలా చేపడతారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు కూడా తెలియజేయడం లేదట! అధికారంలో మేం లేమని ఇలా చేయడం తగదు. మీ ఇష్టమొచ్చినట్లు పనులు చేపడితే ఎలా' అని వైకాపాకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరు గురువారం జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డిని ఫోన్‌లో ప్రశ్నించారు. కడప నగరంలో కీలకహోదాలో ఉన్న వైకాపా సీనియర్ నాయకుడితో కలిసి ఆ మాజీ ఎమ్మెల్యే గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఛాంబరుకు వచ్చి హల్‌చల్ చేశారు. నిబంధనల మేరకు జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలు వచ్చి జిల్లాలో సమస్యలపై చర్చించవచ్చు. అయితే పదవిలో లేని నాయకుడు... ఛైర్‌పర్సన్ ఛాంబరుకు వచ్చి జడ్పీ సీఈవోకు ఫోన్ చేసి, ఇలా అనడం బెదిరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కడప నగరంలో ఉన్న వైకాపా కీలకనేతకు జడ్పీకి వచ్చి సమస్యలపై గళం విప్పే హక్కు లేదు. దీంతో పాటు ఇటీవల జరిగిన బదిలీల వ్యవహారంపై కూడా అడిగినట్లు తెలిసింది. వీరిద్దరూ జడ్పీకి వచ్చి అధికారితో బెదిరింపు ధోరణితో ప్రశ్నించడం సరికాదనే విమర్శలు వస్తున్నాయి.

**అధికారంలో లేకున్నా... ;** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైకాపా నాయకులు గతంలో మాదిరి అధికారులను బెదిరించి తమ పనులు చేయించుకోవాలని చూస్తున్నారు. దీంతో విడవమంటే పాముకు కోపం... కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా అధికారులు సతమతమవుతున్నారు. ఎవరు కన్నెర్ర చేస్తారో.. .! ఏం ఇబ్బందులు పడతామోనని వారు భయపడుతున్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గౌరవానికి భంగం కలిగితే ఆమే స్వయంగా ప్రశ్నించవచ్చు. లేదా కోర్టును ఆశ్రయించవచ్చు. అలా కాకుండా వైకాపా నాయకులు వచ్చి సీఈఓను బెదిరించడం సరికాదనే విమర్శలు వస్తున్నాయి.

# సర్వజనానికీ పరీక్ష

### 20 రోజుల పాటు తిరగాల్సిందే ● రోజూ వందలాది మంది వెనక్కి
### ● రిమ్స్‌లో యంత్రాల కొరతతో రోగుల అవస్థలు


స్కానింగ్ కోసం కేంద్రం బయట వరండాలో కూర్చుని నిరీక్షిస్తున్న మహిళలు, రోగులు

**న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి**

జిల్లాలో పెద్దాసుపత్రిగా పిలిచే కడప రిమ్స్‌లో స్కానింగ్ కోసం వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. సరిపడా యంత్రాలు, వైద్యులు లేకపోవడంతో దాదాపు 20 రోజుల తర్వాత రావాలని సిబ్బంది సూచిస్తున్నారు. అత్యవసరమైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ● కడప రిమ్స్‌కు రోజూ 1,200 నుంచి 1,500 మంది రోగులు ఓపీ, ఐపీకి వస్తుంటారు. వీరిలో పేదలే ఎక్కువగా ఉంటారు. వారిలో దాదాపు రోజుకు 200 నుంచి 250 మంది వరకూ స్కానింగ్‌కు వస్తారు. గర్భిణుల్లో బిడ్డ ఎదుగుదల పరిశీలించడానికి ఈ పరీక్ష తప్పనిసరి. ఇతర అత్యవసరమైన రోగులకూ వైద్యులు స్కానింగ్ చేయమని రాస్తారు. పరీక్ష కేంద్రానికి వెళ్తే 20 రోజుల తర్వాత రావాలని సిబ్బంది చెప్పడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వైద్యులూ లేరు... పరికరాలుండవు

రిమ్స్ రేడియాలజీ విభాగంలో మొత్తం 12 మంది వైద్యులుండాల్సి ఉండగా ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. స్కానింగ్ యంత్రాలు విభాగానికి ఒక్కటి చొప్పున అయిదు నుంచి ఆరు ఉండాల్సి ఉండగా, ఒక్కటి మాత్రమే ఉంది. గత ప్రభుత్వ హయాంలో పరికరాలు కావాలని అనేక మార్లు విన్నవించినా యంత్రాలు మంజూరు చేయలేదు. దీంతో రోజుకు అత్యవసర రోగులకు 50 మందికి, ఓపీ రోగులకు 30 మందికి మాత్రమే స్కానింగ్ చేస్తున్నారు. దాదాపు 200 మంది స్కానింగ్ చేయించుకోకుండానే వెనక్కి వెళుతున్నారు. వారికి 20 రోజుల తర్వాత గడువు ఇస్తున్నారు. ఆరోగ్యం విషమిస్తే అన్ని రోజులు నిరీక్షించగలడా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో చాలామంది అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు.

### చాలా ఇబ్బందిగా ఉంది



మా పాపకు కడుపునొప్పిగా ఉంటే సర్వజన ఆసుపత్రిలో వైద్యులకు చూపించాం. స్కానింగ్ చేయాలని సూచించారు. ల్యాబ్ వద్దకు వెళ్తే ఎక్కువ మంది ఉన్నారు. వైద్యులు రాసిన చీటీ సిబ్బందికి చూపిస్తే, ఇరవై రోజుల తరవాతే రమ్మంటున్నారు. అప్పటి వరకు ఎలా ఆగాలి. పేదలను ఇబ్బంది పెట్టడం తగదు. - వసంత, రోగి తల్లి, కోడూరు

### శస్త్ర చికిత్స వాయిదా వేశారు



నాకు ఒంట్లో బాగోలేకపోతే వైద్యులు పరిశీలించి అడ్మిట్ చేశారు. స్కానింగ్ చేయాలని రాసిచ్చారు. మూడు రోజుల నుంచి అక్కడికి, వార్డుకు తిరుగుతున్నా. ఈ రోజు, రేపు అంటున్నారు. దీంతో శస్త్రచికిత్స కూడా వాయిదా వేశారు. అడిగితే ఆలస్యం అవుతుందని చెబుతున్నారు. మిషన్ ఒక్కటే ఉందంటున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

- రమణమ్మ, వేంపల్లె

### కొరత వాస్తవమే

ప్రస్తుతం రేడియాలజీ విభాగంలో మిషన్ ఒక్కటి మాత్రమే ఉంది. మరొకటి పోర్టబుల్ ఉన్నా అది సరిగ్గా పనిచేయదు. రోగులు ఇబ్బంది పడకూడదని కనీస పరిమితితో స్కానింగులు చేస్తున్నాం. ఈ విభాగానికి 12 మంది వైద్యులకు ఇద్దరు మాత్రమే ఉన్నాం. వైద్యులు, యంత్రాల కొరతపై డీఎంఈ, కలెక్టర్, ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాం. - డాక్టర్ శారద, రేడియాలజీ విభాగాధిపతి

## చెర్లోపల్లెలో చిరుత కలకలం

**రైల్వేకోడూరు, (చిట్వేలి) న్యూస్‌టుడే:** చిట్వేలి మండలం చెర్లోపల్లె పరిసరాల్లో చిరుత సంచారం కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పెద్దసుబ్బరాయుడు అనే వ్యక్తికి చెందిన మేకను దాడి చేసి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం పరిసర ప్రాంతాలను రేంజర్ ధీరజ్ పరిశీలించారు. మేకపై దాడి చేసింది చిరుతనా లేక అడవి కుక్కలా అని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అడవిలో నిరంతరం ప్రత్యేక బృందాలతో పహారా కాస్తున్నామని.. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. చిరుత సంచరిస్తున్నట్లు తెలిస్తే దానిని బంధించడానికి బోను ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.


చిరుత పులి పాద ముద్రలు

## రైలు కిందపడి యువకుడి మృతి


భానుప్రకాష్ (పాతచిత్రం)

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే :** రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం పీలేరులో జరిగింది. కదిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం.. పీలేరు శివారు ప్రాంతం మోడల్‌కాలనీకి చెందిన భానుప్రకాష్ (21) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి మతిస్తిమితం కోల్పోయారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి బయట వచ్చిన యువకుడు రైలు కిందపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాయని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి దుర్మరణం


శంకర్ (పాతచిత్రం)

**పీలేరు గ్రామీణ :** రోడ్డు ప్రమాదంలో అటవీశాఖ విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన గురువారం పీలేరులో జరిగింది. కంభంవారిపల్లె మండలం గొరంట్లపల్లె పంచాయతీ అంబువారిపల్లెకు చెందిన అటవీశాఖ విశ్రాంత గార్డు శంకర్(73) గురువారం ద్విచక్రవాహనంలో చిత్తూరు మార్గంలో వెళ్తుండగా మోడల్‌కాలనీ విద్యుత్తు ఉప కేంద్రం వద్ద ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పీలేరు పోలీసులు తెలిపారు.

## విషద్రావణం తాగి ఆత్మహత్య

**నిమ్మనపల్లె :** విషద్రావణం తాగి యువకుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన బీదం రమేశ్ (23) బుధవారం విషద్రావణం తాగారు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. గ్రామంలో కక్షల కారణంగా ఇతరులు రమేశ్‌ను మందలించడంతో అవమానంగా భావించి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు చెప్పారు. అయితే విషయమై నిమ్మనపల్లె పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## సీఐ తల్లి హత్య కేసులో నిందితురాలి అరెస్టు


ఎల్లమ్మ

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** జిల్లాలో సంచలనం సృష్టించిన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటోపట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితురాలిని గురువారం అరెస్టు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గత నెల 28వ తేదీన ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి (63) అదృశ్యం కావడం అనంతరం హత్యకు గురైన విషయం విధితమే. ఈ కేసులో మొదటి నిందితుడైన వెంకటేష్ తల్లి బండి ఎల్లమ్మని మదనపల్లె-బెంగళూరు రోడ్డులోని అమూల్ పాలడెయిరీ సమీపంలో అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి రూ.లక్ష నగదు సీజ్ చేశామని సీఐ తెలిపారు. స్వర్ణకుమారిని వెంకటేష్, అతని స్నేహితుడు అనీల్, ఇతని తల్లి రమాదేవి సుత్తితో కొట్టి చంపేశారు. అనంతరం స్వర్ణకుమారి శరీరంపై ఉన్న నగలు తీసుకుని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టి రూ.4.97లక్షలు డబ్బు తీసుకున్నారు. ఈ డబ్బులో రూ.1లక్ష నగదు వెంకటేష్ తల్లి ఎల్లమ్మ తీసుకుంది. దీంతో ఆమెపై కూడా కేసు నమోదు చేశామన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేసి జైలుకు పంపుతామని సీఐ తెలిపారు.

# ఆదాయం ఘనం... వసతులు శూన్యం

**ఆర్టీసీ ప్రాంగణాల్లో సౌకర్యాల్లేక ప్రయాణికుల ఇక్కట్లు**

**పీలేరు, న్యూస్‌టుడే:** ఆర్టీసీ ఆదాయం ఆర్జిస్తున్నా సౌకర్యాలు కల్పించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సూచనలు పాటిస్తున్నామని 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నా, వారు ఇచ్చిన సూచనలను పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య అన్ని బస్టాండ్లలో వేధిస్తోంది. జిల్లాకు చెందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రవాణాశాఖ మంత్రిగా ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### సమస్యలు ఇవే...

★ మదనపల్లె డిపో పరిధిలోని గుర్రంకొండ ఆర్టీసీ బస్టాండ్ నిర్మించినా అందులో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం, ఫంకాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు.

★ మదనపల్లె డిపో పరిధిలోని వాల్మీకిపురం బస్టాండ్‌లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్ల గది పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వీటిల్లో విద్యుత్తు దీపాలు లేనందున రాత్రివేళ వినియోగించే పరిస్థితి లేదు.

★ పీలేరు డిపో పరిధిలోని కలకడ బస్టాండ్ ప్లాట్‌ఫాం సిమెంట్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయలేదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది.

★ కలికిరిలో పరిస్థితి మారలేదు. ఇక్కడ బస్టాండ్ నాలుగు రోడ్ల నుంచి కిలోమీటరు దూరంలో ఉండడంతో పగలు వేళ దూర ప్రాంతాల నుంచి ఆర్డినరీ బస్సులు కూడా బస్టాండ్‌కు రావు. ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా రాత్రి ఎనిమిది దాటితే బస్టాండ్‌కు వెళ్లకుండా నాలుగు రోడ్ల నుంచి మదనపల్లె, తిరుపతి మార్గాల్లో వెళ్తాయి. ఇక్కడ మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

★ పీలేరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు ఇబ్బందికరంగా ఉన్నాయి. పురుషులకు మూడు మరుగుదొడ్లు ఉన్నా అందులో ఒకటి వినియోగించే పరిస్థితి లేదు. ఉన్న రెండు మరుగుదొడ్లు చాలడం లేదు. స్త్రీల మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు. శుభ్రత లేనందున కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లేవారు ముక్కులు మూసుకుని వెళ్లే దుస్థితి. డీఎం కార్యాలయంలో దిగువన సిబ్బంది వినియోగానికి ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు.

★ మదనపల్లె బస్టాండ్‌లో పురుషులకు ఆరు, స్త్రీలకు ఆరు మరుగుదొడ్లు ఉన్నా ఉదయం వేళ దూరప్రాంత బస్సుల్లో వచ్చే ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వస్తోంది. అదనంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదు.

★ రాయచోటిలో ఆర్టీసీ ప్రాంగణం అధ్వానంగా ఉండేది. జిల్లా కేంద్రం అయిన తర్వాత రూ. రెండు కోట్లతో బస్టాండ్ ఏర్పాటు చేయడంతో శుభ్రంగా ఉన్నాయి. నీటి సౌకర్యం కూడా బాగానే ఉన్నాయి.

★ రాజంపేట బస్టాండ్‌లో మరుగుదొడ్లలో పాతరకం బేసిన్లు ఉండడంతో ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులకు అవసరం మేరకు మరుగుదొడ్లు లేవు.

★ జిల్లాలో పీలేరు, మదనపల్లె 1, 2, రాయచోటి, రాజంపేట డిపోల్లో మొత్తం 478 బస్సులున్నాయి. ఇందులో 154 ప్రైవేట్ అద్దె బస్సులు, ఆర్టీసీ బస్సులు 324 ఉన్నాయి. అన్ని డిపోల్లో 133 పక్కా దుకాణాలు, 286 ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు ఆర్టీసీకి రూ.37,76,677 వస్తోంది. ఆదాయంలో పీలేరు ప్రథమ, మదనపల్లె-2 డిపో ద్వితీయస్థానాల్లో ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని బస్టాండ్లలో మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పీలేరులో మూతపడిన మరుగుదొడ్లు


వాల్మీకిపురంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

### చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పీలేరులో ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉంది. ఈ విషయంలో ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆర్టీసీ ఇంజినీర్లు వచ్చి ప్రస్తుత మరుగుదొడ్లను పరిశీలించి కొత్త వాటికి అంచనాలు తయారు చేయాలని కోరాం. గుర్రంకొండ కొత్త బస్టాండ్ కావడంతో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. వాల్మీకిపురం, కలికిరి, కలకడ బస్టాండ్‌లలో మరుగుదొడ్లను మరమ్మతులు చేయిస్తాం.


**- రాము, ప్రజారవాణా శాఖ జిల్లా అధికారి, రాయచోటి**

## కొబ్బరి కాయలు తెంపే కూలీ మృతి

● దాడి చేస్తారన్న భయంతో శవం మాయం

● ప్రాజెక్టులో వేసి తప్పించుకున్న వ్యాపారి

**- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ**


హరినాథ్ (పాతచిత్రం)

అతనో కొబ్బరికాయల వ్యాపారి... కొబ్బరి బొండాల వ్యాపారం కోసం కాయలు తెంపడానికి ఓ కూలీని తనతో పాటు తీసుకెళ్లాడు... చెట్టెక్కిన కూలీ పట్టుతప్పి కిందపడి మృతి చెందాడు.. విషయం బయటికి తెలిస్తే తనపై వారి బంధువులు దాడి చేస్తారని, కేసు నమోదవుతుందనే భయంతో గుట్టుచప్పుడు కాకుండా ఆ శవాన్ని మాయం చేసి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రాజెక్టులో పడేశారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో అసలు విషయం వెలుగుచూసింది. పోలీసులందించిన సమాచారం మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం మర్రికుంటపల్లె పంచాయతీ వీరవాండ్లపల్లెకు చెందిన హరినాథ్ (47) కూలి. ఈ క్రమంలో కలికిరిలో కొబ్బరికాయల వ్యాపారం చేసే అల్లాబక్షు ఈ నెల 2న హరినాథ్‌ను పత్తేగడ పంచాయతీ కొత్తమాలపల్లెలో కొబ్బరికాయలు తెంపడానికి తీసుకెళ్లాడు. చెట్టుపై కాయలు కోస్తుండగా హరినాథ్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మృతుడి బంధువులు దాడి చేస్తారని, కేసు పెడతారన్న భయంతో మరో ఇద్దరితో కలసి మృతదేహాన్ని ఆటోలో చిత్తూరు జిల్లా సదుం మండలం పాపిరెడ్డిగారిపల్లె వద్దనున్న ప్రాజెక్టులో పడేశారు. పనికి వెళ్లిన హరినాథ్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తమ్ముడు కృష్ణయ్య ఈ నెల 8న పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసిన కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. గురువారం పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టులో నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. అప్పటికే శవం కుళ్లిపోయి ఉండటంతో అక్కడికక్కడే శవపరీక్ష చేసి బంధువులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

### రేబిస్ సోకి మహిళ మృతి


మునిలక్ష్మి (పాత చిత్రం)

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** రేబిస్‌ను టీకాలతో పూర్తిగా నివారించవచ్చు. అయినా చాలా మంది కుక్కకాటుతో దాని బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వీధి కుక్కలతోనే కాదు పెంపుడు కుక్కలతో సోకుతుందని తెలుసుకోలేకపోతున్నారు. కె.బుడుగుంటపల్లె పంచాయతీ వికాస్‌నగర్‌కు చెందిన మునిలక్ష్మి (35)ని తమ పెంపుడు కుక్క కరవడంతో రేబిస్ బారిన పడి చికిత్స పొందుతూ చివరకు ప్రాణాలు విడిచారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిలక్ష్మి ఓ పెంపుడు కుక్కను పెంచుకుంటున్నారు. తన పిల్లలతో సమానంగా దాన్ని ఆమె సాకుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆ కుక్కే ఆమెను కరిచింది. తాము పెంచుకుంటున్న కుక్కే కదా అని వైద్యం చేయించుకోవడంలో ఆమె నిర్లక్ష్యం వహించారు. రోజులు గడిచేకొద్దీ రేబిస్ లక్షణాలు కనిపించడంతో వ్యాధి సోకినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఇటీవల చేర్పించి చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ చనిపోయినట్లు స్థానికులు వివరించారు.

## డ్వాక్రా సంఘాలపై రాజకీయాలు మానుకోవాలి

**రాయచోటి, న్యూస్‌టుడే:** డ్వాక్రా సంఘాలపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. వీఏవోలతో కలిసి గురువారం నిరసన తెలియజేశారు. పీలేరు మండలం ముడుపుల వేముల గ్రామ పంచాయతీ వీవో సమావేశంలో గ్రూప్ సభ్యుల మెజార్టీ తీర్మానం లేకుండా సంతకాలు పెట్టాలని వీఏవోలు, సంఘ మిత్రలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సంఘ మిత్రలపై ఒత్తిడి తీసుకొస్తున్న అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. పీలేరు ఏపీఎం జోహార్‌బాషా, డీఎంజీ మధు, సీసీ చంద్రకళ వీవోల జనరల్ బాడీ సమావేశంలో మెజార్టీ సభ్యుల తీర్మానాన్ని ఆమోదించకపోవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అనంతరం డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, వీవోలు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియచేస్తున్న వీఏవోలు, సీపీఐ నాయకులు

## ఆలయాల అభివృద్ధికి కృషి

**రామసముద్రం, న్యూస్‌టుడే :** నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. రామసముద్రం మండలం కాప్పల్లె గ్రామపంచాయతీ అజ్జమరెడ్డిపల్లెలో తెదేపా నాయకులు మోడం సిద్ధప్ప నిర్మించిన రాజరాజేశ్వరీదేవి ఆలయంలో గురువారం దసరా నవరాత్రుల పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆర్.నడింపల్లె గ్రామపంచాయతీలోని వాలీశ్వరస్వామికొండపైకి రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లతో పనులు చేపట్టామన్నారు. అలాగే చెంబకూరు సమీపంలోని గట్టువెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.70 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లోని ఆలయాల వద్దకు సీసీరోడ్ల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అజ్జమరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే సమక్షంలో పలువురు వైకాపా నుంచి తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలోనే రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, నాయకులు కృష్ణమరాజు యాదవ్, తిప్పన్న, కృష్ణమూర్తి, లోకనాథరాజు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.


అజ్జమరెడ్డిపల్లె రాజరాజేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

### ట్రాఫిక్ తగ్గించేందుకు చర్యలు

**మదనపల్లె పట్టణం :** కదిరిరోడ్డు నీరుగట్టువారిపల్లెలో ట్రాఫిక్ తగ్గించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి నీరుగట్టువారిపల్లెలో పర్యటించారు. ప్రధాన రహదారిలో మలుపు ఉన్నందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు తనకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు దీన్ని పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దారు ఖాజాబీ, ట్రాన్స్‌కో డీఈ గంగాధర్, తెదేపా నాయకులు ఆర్.నీలకంఠ, రామ్మూర్తినాయుడు, నాగార్జునబాబు, నవీన్‌చౌదరి, కృష్ణ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

## కంటి జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

**మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే :** కంటి జబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాద్‌రాజు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రపంచ దృష్టిలోప దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో కంటి జబ్బు బాధితులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు దివ్య, లక్ష్మీకళ, టి.ఎ.కలాం ఆజాద్, భాగ్యరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

## కోర్టులో గంగమ్మకు బంగారు కిరీటం

**మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే :** కోర్టులో గంగమ్మకు బంగారు కిరీటం తయారు చేయించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్ మార్పూరి చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ.. బంగారు కిరీటాన్ని ఈ నెల 12న దసరా సందర్భంగా అమ్మవారికి ధరింప చేయనున్నామని తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో పాటు ఎంతో మంది చేయూత ఉందన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ కార్యదర్శి మార్పూరి బాబు, గౌరవాధ్యక్షులు జోళపాలెం భవానీప్రసాద్, సభ్యులు రాటకొండ రంగస్వామి నాయుడు, జోళపాలెం కరుణాకర్‌నాయుడు, జోళపాలెం చిన్ని, పెరవళి వేణుగోపాల్‌నాయుడు, మార్పూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.


బంగారు కిరీటాన్ని చూపుతున్న ఆలయ కమిటీ సభ్యులు

## వేధింపుల కేసులో ఆరు నెలల జైలుశిక్ష

**గాలివీడు, న్యూస్‌టుడే:** వరకట్నం వేధింపుల కేసులో నిందితుడికి న్యాయమూర్తి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు గాలివీడు పోలీసులు గురువారం తెలిపారు. నూలివీడుకు చెందిన శశికళ తన భర్త దేరింగుల రామకృష్ణ వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ 2018లో ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదైంది. లక్కిరెడ్డిపల్లె జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఫైజున్నీషా పూర్వోపరాలు పరిశీలించి పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చారని వివరించారు.

## ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన వేగవంతం చేయండి

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని హంద్రీ-నీవా భూసేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్‌రాఘవేంద్ర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బి.కొత్తకోట మండలం కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఫ్రీహోల్డ్‌భూముల పునఃపరిశీలన తంబళ్లపల్లె నియోజకవర్గంలో 70-80 శాతం వరకు పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను త్వరగాముగించాలని సూచించారు.

## ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** బి.కొత్తకోట మండలం గట్టులో గురువారం ఎరువుల దుకాణాలను మదనపల్లె ఏడీ కె.శివశంకర్, స్థానిక ఏఓ చంద్రశేఖర్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు బిల్లులు జారీ చేయకపోవడం, స్టాక్ రిజిస్టర్ సక్రమంగా వివరాలను చూపకపోవడంతో మంజునాథ్ ఎరువుల దుకాణానికి జారీ చేసిన లైసెన్సును 15 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు ఏడీ ప్రకటించారు. ఇక్కడే ఉన్న వినాయక ఎరువుల దుకాణంలో తనిఖీ చేసి లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసుకొని తమను మోసం చేశారని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వారు కళ్యాణదుర్గం ప్రజావేదిక వద్దకు చేరుకొని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో తమ బాధను చెప్పుకున్నారు. కళ్యాణదుర్గం ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని 2022లో మమత (మదనపల్లి), అనిత (శ్రీకాకుళం), అవినాష్‌రెడ్డి (తిరుపతి), ఈశ్వర్ (విజయవాడ) అనే వ్యక్తులు తమ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. రెండేళ్లుగా వారి చుట్టూ తిరుగుతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదని, డబ్బు తిరిగి ఇవ్వలేదని వాపోయారు. గతంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు, కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మోసం చేసిన వారందరూ వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అనుచరులు కావడంతో పోలీసులు ఏం చేయలేకపోయారని ఆరోపించారు. న్యాయం చేయాలని కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులు ఆవేదన వ్యకం చేశారు.


## ఎదురు కాల్పుల ఘటనపై న్యాయ విచారణ జరపాలి

**రాయచోటి, న్యూస్‌టుడే:** తెల్తులి-నెండూర్ ప్రాంతంలో ఈ నెల 4న జరిగిన ఎదురు కాల్పులపై న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాయచోటిలో గురువారం ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ ఎత్తున దాడి చేసి 31 మంది ఆదివాసీలను చంపేశాయన్నారు. ఎప్పటిలాగా ఈ ఘటనను ప్రభుత్వం ఎన్‌కౌంటర్‌గా ప్రకటించిందన్నారు. మృతులు ఎందరో, ఎవరో పోలీసులు స్పష్టత ఇవ్వలేదన్నారు. అక్కడి ఖనిజ సంపదను దోచి పెట్టేందుకే ప్రభుత్వం ఇలాంటి ఘటనలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రెడ్డెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగిమళ్ల రమణయ్య, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు

## గొప్ప మానవతా వాది రతన్ టాటా

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రతన్ టాటా గొప్ప మానవతా వాది అని పీలేరు ప్రజా సంఘాల నేతలు అన్నారు. గురువారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ధరణికుమార్, టీఎల్ వెంకటేష్, అమృతతేజ, శ్రీనివాసులు, భానుప్రకాష్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.


పీలేరులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

# హార్సిలీహిల్స్ చుట్టేద్దాం రండి

**దసరా సెలవులకు ఉత్తమ విడిది**

**కుటుంబంతో కలిసి పర్యటించతగ్గ ప్రాంతం**

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నారులపై చదువులు విపరీతమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. విద్యాబోధనతో పాటు ఆటపాటలు లేకపోవడంతో పిల్లలు పుస్తకాల పురుగుల్లా, చరవాణులకు అతుక్కుపోవడం ఆందోళన కల్గిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో దసరా సెలవులను బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ సందర్శనకు ఉపయోగించుకుంటే విద్యార్థులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారు. సముద్రమట్టానికి 4,312 అడుగుల ఎత్తులో ఉన్న ఈ హిల్ స్టేషన్‌పై ఆహ్లాదకరమైన వాతావరణం.. ఎటువైపు చూసినా పచ్చదనం పరుచుకున్న ప్రకృతి అందాలు ఆకట్టుకుంటాయి. అటవీ మార్గం గుండా కాలినడకన కొండపైకి రాకపోకలు సాగించడం సాహసోపేతంగా సాగుతుంది. స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టడం, రాక్ క్లైంబింగ్, రోప్ సైక్లింగ్‌లతో పాటు వివిధ రకాల క్రీడలను పర్యాటక ప్రాంగణంలో ఆడుకోవచ్చు. మినీ జంతు ప్రదర్శనశాలలో మొసళ్లలతో పాటు వివిధ రకాల జంతువులు,పక్షులను చూడొచ్చు. పర్యావరణ అధ్యయన కేంద్రం సందర్శించడం ద్వారా ప్రకృతి సమతౌల్యతపై అవగాహన పెంచుకోవచ్చు. ఇక్కడ ఉన్న మానస సరోవరంలో బోటింగ్ చేయడం సరదాగా సాగుతుంది. ఇక్కడ ఉన్న మహా నీలగిరి వృక్షాన్ని చూసి 'అబ్బో ఎంత పెద్ద చెట్టో' అంటూ ఆశ్చర్యపోవడం ఖాయం. గాలి బండపై నుంచి సూర్యోదయం, సూర్యాస్తమయాలను వీక్షించడం చక్కగా ఉంటుంది. ప్రస్తుత సీజన్లో తరచుగా ఎడతెరిపి లేకుండా కురిసే మంచులో హార్సిలీహిల్స్ మూసుకుపోతుంది. పట్టపగలే లైట్లు వేసుకుని వాహనాల రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఊటిని తలపింపచేస్తాయి. కొండపైకి వచ్చిన పర్యాటకులు బస చేయడానికి పర్యాటక, అటవీశాఖలతో పాటు ప్రైవేటు అతిథి గృహాలను అద్దెలకు ఇస్తారు. ఆన్‌లైన్లోనే గదులను బుక్ చేసుకునే అవకాశం ఉంది. తల్లిదండ్రులకు ఏమాత్రం అవకాశం దొరికినా.. చిన్నారులను హార్సిలీహిల్స్ పర్యటనకు తీసుకెళ్లడం ఉత్తమంగా అధికారవర్గాలు చెబుతున్నాయి.


మానస సరోవరంలో విహరిస్తున్న పర్యాటకులు

### ఎలా వెళ్లాలంటే?

హార్సిలీహిల్స్ తిరుపతి, బెంగళూరుల నుంచి 150, చెన్నై నుంచి 250, హైదరాబాదు నుంచి 525 కిలో మీటర్ల దూరంలో ఉంది. మదనపల్లె, బి.కొత్తకోటల నుంచి 30కి.మీల దూరంలో ఉంటుంది. మదనపల్లె నుంచి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సును నడుపుతున్నారు. హార్సిలీహిల్స్ క్రాస్ నుంచి కొండపైకి టాక్సీ సదుపాయం కూడా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి హార్సిలీహిల్స్‌కు రెగ్యులర్‌గా నడిచే ట్యాక్సీలు ఉన్నాయి.

★ హార్సిలీహిల్స్‌పై పర్యాటకశాఖ ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అనేక ప్రైవేటు హోటళ్లు ఉన్నాయి. ఇక్కడ ఏసీ గదులకు అంత డిమాండ్ ఉండదు... రోజుకు నాన్ ఏసీ/ఏసీ గదులు రూ.1,800 నుంచి రూ.7,500 వరకు అద్దె వసూలు చేస్తున్నారు.

# మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## దృష్టి లోపాలపై అవగాహన ర్యాలీ



చింతపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

**కలికిరి, (చింతపర్తి) వాల్మీకిపురం, న్యూస్‌టుడే:** సర్వేంద్రియానం నయనం ప్రధానం అని వైద్యులు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ జులేఖబేగం అన్నారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా చింతపర్తి పీహెచ్‌సీలో దృష్టి లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఇంద్రాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, భానుబి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయితీపై వంటనూనె సరఫరాకు వినతి

**పీలేరు గ్రామీణ:** పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణంలో రాయితీపై వంటనూనె సరఫరా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి కోరారు. ఈ మేరకు గురువారం మార్కెట్ కమిటీ జిల్లా అధికారి త్యాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** కారు ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణంలో గురువారం జరిగింది. అమ్మచెరువు మిట్టకు చెందిన లక్ష్మీదేవమ్మ, వెంకటరమణలు పట్టణంలో ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరు ద్విచక్రవాహనంపై పట్టణానికి వస్తుండగా చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మీదేవమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ఆవు మృతిపై కేసు నమోదు

**రామసముద్రం :** రామసముద్రం మండలం మూగవాడి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడిఆవు మృతిపై బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.



నక్కలదిన్నె తండాలో శాకంబరిగా మారెమ్మ



చెర్లోపల్లెలో దుర్గాదేవిగా రెడ్డెమ్మ దేవత



కోటపల్లెలో ధనలక్ష్మీగా పద్మావతి అమ్మవారు



రామసముద్రంలో పుష్పాలంకరణలో దుర్గాదేవి




బి.కొత్తకోటలో ధనలక్ష్మీగా అమ్మవారి దర్శనం

## దుర్గామాత... అభయప్రదాత

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



నిమ్మనపల్లె: బాలినాయుని పల్లెలో చౌడేశ్వరిదేవి



దుర్గాదేవిగా చింతపర్తి వాసవీ మాత



గుర్రంకొండలో దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కురబలకోటలో వాసవీ మాత అలంకరణ



## అర్హులకు ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

**ములకలచెరువు, న్యూస్‌టుడే :** పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని తంబళ్లపల్లె తెదేపా నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచించారు. ములకలచెరువులో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీవోలు, టీఏలు, క్షేత్రసహాయకులతో పనుల గుర్తింపుపై సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కూలీలకు పనులు కల్పించి వలసలు వెళ్లకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి కిరణ్ కుమార్

**బి.కొత్తకోట, న్యూస్‌టుడే:** మానసిక ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేకశ్రద్ధ చూపాలని బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బి.కొత్తకోట ఆసుపత్రిలో రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను తెలిపే ప్లకార్డులను వైద్యసిబ్బంది ప్రదర్శించారు. స్థానిక వైద్యులు నరసారెడ్డి, ఫార్మసిస్టు సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## రతన్ టాటాకు ఘన నివాళి



పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని మాజీ సైనికులు సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని నిమ్మనపల్లె కూడలిలో రతన్‌టాటా చిత్రం ఏర్పాటుచేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఆర్.జె.వెంకటేష్, రామన్న, బి.భాస్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక శ్రీకృష్ణ కల్యాణమండపం వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేసి నివాళులు అర్పించారు. తెదేపా నాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, శశిధర్‌నాయుడు, శ్రీకాంత్, ఆనంద్‌యాదవ్, మోహన్‌రెడ్డి, శేషాచలపతినాయుడు, ఈ.ఆర్.నాయుడు, బండి బాలాజీ, నారాయణస్వామి, మధుసూధన్‌నాయుడు, దేవేంద్ర, టి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బి.కొత్తకోట :** రతన్‌టాటా మృతి తీరని లోటని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు ఫర్వీన్‌తాజ్ అన్నారు.

# రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన యువతి సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆమెను ప్రాణాలతో కాపాడారు. ఆ వివరాలు ఇలా.. రాయచోటికి చెందిన ఓ యువతి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమె ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ.. మత్తు మాత్రలు వేసుకునే వీడియోను కుటుంబ సభ్యులకు పంపింది. కుటుంబ సభ్యులు ఆ వీడియోను డీజీపీ కంట్రోల్‌రూమ్‌కు పంపి తమ బిడ్డను కాపాడాలని కోరారు. అక్కడి నుంచి సమాచారం రావడంతో అలిపిరి సీఐ రామ్‌కిషోర్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు. ఆ యువతి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉండగా.. అప్పటి వరకు మాట్లాడిన ఫోన్ నెంబర్ల ఆధారంగా ఆరా తీశారు. వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన ఆ యువతి.. స్నేహితుడి గదికి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడింది.

## వసతి గృహ సమస్యలపై న్యాయమూర్తి ఆరా



వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా

**వీరబల్లి, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన వీరబల్లిలోని బాలుర వసతి గృహాన్ని గురువారం రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఆసిఫా సుల్తానా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో అక్కడున్న వసతులను పరిశీలించారు. వంటగదులు, మరుగుదొడ్ల గదుల్లోనుంచి పెచ్చులు ఊడి కింద పడుతుండటాన్ని గుర్తించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వసతి గృహ సంక్షేమాధికారి సుబ్బరాజుతో మాట్లాడారు. సెలవులు ముగిసే నాటికి మౌలిక వసతులు కల్పించాలన్నారు. వీరబల్లి పోలీసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు



కూలిన రక్షణ గోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

**పెనగలూరు, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ఎంపీపీ కొండూరు సౌందర్య అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎన్‌ఆర్ పురం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. గతంలో వచ్చిన వరదల సమయంలో కూలిపోయిన రక్షణ గోడను పరిశీలించారు. పలు రకాల సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు అందాలి




మాట్లాడుతున్న డీఏవో చంద్రానాయక్, పక్కన వ్యవసాయ అధికారులు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు ప్రతి రైతుకూ చేరే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గ స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రబీ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతు సేవ కేంద్రాలలో అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. క్షేత్రస్థాయిలో వీఏవోలు, వీహెచ్‌వోలు రైతులకు పథకాలపై వివరించి, అవగాహన కల్పించాలని సూచించారు. ఏడీఏ కవిత, ఏవో సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం తనిఖీ

**రాయచోటి, న్యూస్‌టుడే:** రాయచోటి పట్టణం కొత్తపేటలోని బాలికల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న తనిఖీ చేశారు. వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. వసతి గృహాలకు శుద్ధి జల సౌకర్యం కల్పించాలని కోరారు. వంట, పడక గదులను పరిశీలించారు. గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## స్వగ్రామానికి చేరిన మృతదేహం

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** కువైట్‌లో హత్యకు గురైన వీరాంజనేయులు మృతదేహం సొంతంవారిపల్లి గ్రామం గడ్డమీదపల్లి ఎరుకల కాలనీకి గురువారం సాయంత్రానికి చేరింది. జీవనోపాధి కోసం వెళ్లి శవమై తిరిగి రావడంతో మృతుడి భార్య చెన్నకేశవమ్మ, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

## 12న శ్రీవారి కల్యాణోత్సవం

**గాలివీడు, న్యూస్‌టుడే:** గాలివీడులోని శ్రీవెంకటరమణ దేవాలయంలో విజయదశమిని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటరమణ స్వామి కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు తంగాల పెద్ద వెంకటరమణ పేర్కొన్నారు. ఆలయం వద్ద గురువారం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను సమీక్షించారు. విద్యుత్తు దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. కల్యాణం అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.



ఇసుక క్వారీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఇసుక క్వారీల పరిశీలన

**పెనగలూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలో నూతనంగా మంజూరయిన రెండు ఇసుక క్వారీలను తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణీ, ఎంపీడీవో విజయారావు గురువారం పరిశీలించారు. కోమంతరాజపురం, నారాయణనెల్లూరు ఇసుక క్వారీ ప్రాంతాలను పరిశీలించారు. ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

## రైల్వేకోడూరులో ఉద్రిక్తత

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా థియేటర్ వద్ద గురువారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికులైన ముక్కా రామసుబ్బారెడ్డి, ఆవుల ఆదికేశవరెడ్డితో పాటు మరికొందరు కలిసి జేసీబీ, హిటాచీ వాహనాలతో థియేటర్ గేట్లను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. థియేటర్ విషయమై హైకోర్టులో కేసు నడుస్తోందని పటం చంద్రశేఖర్ అనే వ్యక్తి పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ హేమసుందర్‌రావు సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా సదరు వ్యక్తులు వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో వాహనాలను సీజ్ చేసి, దౌర్జన్యం చేయడంతో పాటు తమ విధులకు ఆటంకం కలిగించారని కేసులు నమోదు చేశామని సీఐ వివరించారు.

## లడ్డూ వేలం నగదు విషయంపై వివాదం

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** గణేష్ లడ్డూ వేలంపాట పాడి ఏడాది గడుస్తున్నా నగదు ఇవ్వలేదని ఓ మహిళపై దాడి చేసి గాయపర్చిన సంఘటన సుండుపల్లి శివాజీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికురాలైన శాంతమ్మ గతేడాది వినాయక మండపం వద్ద రూ.24 వేలతో లడ్డూ వేలంపాట పాడి దక్కించుకున్నారు. ఈ ఏడాది వినాయక చవితికి కూడా డబ్బులివ్వకపోవడంతో స్థానికులైన పసుపులేటి ప్రహ్లాదతో పాటు మరో ఆరుగురు ఎందుకు డబ్బులివ్వట్లేని ఆమె ఇంటి వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. శాంతమ్మపై దాడి చేసేందుకు వచ్చారని ఆమె కుమార్తె లహరి భావించి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆమెపై వారంతా దాడి చేశారని శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**చిన్నమండెం, న్యూస్‌టుడే:** రాయచోటి నియోజకవర్గంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు తెదేపా నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సి.పాలిమేరపల్లెలో నూతనంగా తవ్వించిన బోరు బావికి మోటారు ఏర్పాటు చేసి గురువారం నీటిని వదిలి పూజలు చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణ కళలలో భళా

☛ రాష్ట్ర స్థాయి తైక్వాండో క్రీడల్లో సత్తా

☛ రైల్వేకోడూరు విద్యార్థినుల ఆదర్శం

– న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

బాలికలకు ఇప్పుడు సమాజంలో ఆత్మరక్షణ అత్యవసరమవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ పిల్లలకు యుద్ధ విద్యల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. రైల్వేకోడూరుకు చెందిన పలువురు విద్యార్థినులు తైక్వాండోలో ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. ఓ వైపు చదువులో రాణిస్తూనే పతకాల పంట పండిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలను చవిచూస్తూ జాతీయ స్థాయి పోటీలకు పంచ్ విసురుతున్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాలలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి మధ్యప్రదేశ్‌లో నవంబరు 8 నుంచి 11వ తేదీ వరకు జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారి నేపథ్యంపై ప్రత్యేక కథనం.



జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులతో సీఐ వెంకటేశ్వర్లు, శిక్షకులు

### జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తా



తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పథకం సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం తెచ్చుకోవాలనే ఆకాంక్షతో శిక్షణ తీసుకుంటున్నా. ఓ వైపు చదువులో రాణిస్తూనే తైక్వాండో నేర్చుకుంటున్నా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నా. ఎప్పటికైనా క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా.

– పి.హర్షిత, తొమ్మిదో తరగతి

### పట్టుదలతో సాధన



తైక్వాండో ప్రతి రోజు సాధన చేస్తుంటే ఎలాగైనా ఇంకా బాగా ఫైట్ చేయాలన్న పట్టుదల, కసి పెరుగుతోంది. మా శిక్షకుడు శివాజీ మెలకువలు నేర్పిస్తున్నారు. చదువుకోవడంతో పాటు తైక్వాండో నేర్చుకుంటే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తా.

– పి.రిజ్వానా, ఆరో తరగతి

### పోలీసు కొలువు సాధించడమే లక్ష్యం



నాకు పెద్ద పోలీస్ ఆఫీసర్ కావాలని.. ప్రజలకు సేవ చేయాలని ఉంది. అందుకే ఇప్పటి నుంచే తైక్వాండో, కరాటే వంటి క్రీడలపై దృష్టి సారిస్తున్నా. రోజూ ఉదయాన్నే రన్నింగ్ సాధన చేస్తున్నా. చదువుతో పాటు క్రీడల్లో మెరుగ్గా ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. పోటీల్లో బంగారు పతకం సాధించాలని ఉంది. జాతీయ స్థాయి పోటీల్లో ఇంకా మెరుగ్గా ఆడతా.

– డి.త్రివేణి, ఆరో తరగతి

### పోరాటం ధైర్యాన్నిచ్చింది



తైక్వాండో పోటీల్లో దెబ్బలు తగిలేకొద్దీ పట్టుదల పెరుగుతుంది. ప్రత్యర్థిని ఎదుర్కోవాలన్న ధైర్యం వస్తుంది. గెలవాలని ప్రయత్నిస్తాం. ఇవన్నీ భవిష్యత్తులో జీవితానికి ఎంతో ఉపయోగపడతాయి. విద్య, ఉద్యోగంతో పాటు సాధారణ జీవితంలో కూడా తైక్వాండో క్రీడ ఉపయోగపడుతుంది. మనల్ని మనం రక్షించుకోవడం ప్రాధాన్యం.

– కె.అఖిల, తొమ్మిదో తరగతి



# మహిషాసుర మర్దని... నమోస్తుతే



రాయచోటిలో దుర్గాదేవి అలంకారంలో...



సంబేపల్లెలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న నల్ల గంగమ్మ



పుల్లంపేట : దుర్గాదేవి అలంకరణలో కొత్తపురి ఎల్లమ్మ



నందలూరు : మహిషాసురమర్దని అలంకరణలో కన్యకాపరమేశ్వరి



లక్కిరెడ్డిపల్లెలో గాజుల అలంకరణలో....



రాజంపేట గ్రామీణ: కనకదుర్గమ్మ ఆలయంలో మహిళల ప్రత్యేక పూజలు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారు మహిషాశుర మర్దని, దుర్గాదేవి రూపాల్లో దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు చోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కుంకుమార్చన పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



వీరబల్లి గంగమ్మ ఆలయంలో భక్తుల సందడి

## ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం

**రాజంపేట, న్యూస్‌టుడే:** రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సంతోష్ అగర్వాల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, చిన్న సమస్య ఎదురైనప్పుడే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పాల్గొన్నారు.




పుల్లంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రాజంపేటలో కంటి ఆకారంలో ఏఐటీఎస్ విద్యార్థులు

**పుల్లంపేట:** మానవునిలో సర్దుబాటు సామర్థ్యం తగ్గిపోవడంతోనే దృష్టిలోపం వస్తుందని పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సానే శేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు.

# రతన్ టాటాకు ఘన నివాళి



రతన్ టాటా నివాళులర్పించి నినాదాలు చేస్తున్న తెదేపా నాయకులు



రాజంపేటలో రతన్‌టాటా చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న భాజపా నాయకులు

**రాయచోటి, న్యూస్‌టుడే:** పారిశ్రామికవేత్త రతన్ టాటాకు రాయచోటిలో గురువారం ఘనంగా నివాళి అర్పించారు. సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా చిత్రపటానికి పూల మాలలు వేశారు.



సాయి ఇంజినీరింగ్ కళాశాలలో రతన్ టాటా చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది

**రాజంపేట:** వ్యాపార దిగ్గజం రతన్‌టాటా మృతి వ్యాపార రంగానికి తీరని లోటని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**రైల్వేకోడూరు:** రైల్వేకోడూరులోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకటరెడ్డి, దశరథరామయ్య, శ్రీధర్ ఆధ్వర్యంలో రతన్ టాటా మృతికి సంతాపం తెలిపారు.

**రైల్వేకోడూరు:** రతన్‌టాటా గొప్ప పారిశ్రామికవేత్త మాత్రమే కాదని.. గొప్ప మానవతావాది అని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడు పేర్కొన్నారు. స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం వద్ద గురువారం రతన్ టాటా చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశానికి ఐటీ రంగాన్ని తీసుకువచ్చి దాన్ని ఒక పరిశ్రమగా మార్చారన్నారు. కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి రూ.1500 కోట్లు విరాళమిచ్చి ప్రజలకు అండగా నిలిచారన్నారు. తన సంపాదనలో ఎనభై శాతం దానధర్మాలకు కేటాయించిన ఆయన మరణం దేశానికి తీరని లోటని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు హేమరాజ్, నవీన్, సుమంత్, సుబ్రహ్మణ్యం, భాస్కర్ పాల్గొన్నారు.

## వంతెన... ప్రమాదం అంచున



మండల పరిధిలోని పుల్లంగేరుపై వంతెన ప్రమాదకరంగా తయారైంది. గతంలో చిన్నచిన్న రంధ్రాలు ఏర్పడంతో వాహనాల రాకపోకలతో అవి మరింత పెద్దవిగా మారాయని.. దీంతో రోడ్డు కుంగుతోందని చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– న్యూస్‌టుడే, పుల్లంపేట

## నేడు లక్ష కుంకుమార్చన కార్యక్రమం

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** రాజంపేట మండల పరిధిలోని ఎల్లమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.